సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : సహస్రాది తులసీదళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించాలని ఈవో శిరీష తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న కేజీహెచ్ ఆర్‌ఎంవోలు డాక్టర్ లక్ష్మీతులసి, డాక్టర్ జగదీష్

మహారాణిపేట : రోగులకు మెరుగైన సేవలందించాలని, అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని కేజీహెచ్ ఆర్‌ఎంవోలు డాక్టర్ లక్ష్మీతులసి, డాక్టర్ జగదీష్‌కుమార్ తెలిపారు. గురువారం కేజీహెచ్‌లోని అన్ని వార్డుల హెడ్ నర్సులు, ఐసీయూ వార్డుల స్టాఫ్ నర్సులు, సీనియర్ నర్సులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీతులసి మాట్లాడుతూ రోగులకు అందించే సేవల విషయంలో రాజీ పడరాదన్నారు. ఈ విషయంలో ఎటువంటి సమస్యలున్నా తమకు, డైటీషియన్‌కు తెలియజేయాలన్నారు. క్యాజువాల్టీ, ఓపీ, ఇతర అత్యవసర విభాగాల్లో పని చేసే వారు, ఐసీయూ వార్డుల్లో విధులు నిర్వర్తించే వారు బాధ్యతగా పని చేయాలని ఆర్‌ఎంవో డాక్టర్ జగదీష్ తెలిపారు. గ్రేడ్-1, 2 నర్సింగ్ సూపరింటెండెంట్లు జె. విజయలక్ష్మి, కల్పనామౌళి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.







ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై బోధిస్తున్న ఉపాధ్యాయులు, శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు

ఇది కదా అభివృద్ధి



చిన్నారుల చదువుల్లో.. డిజిటల్ వెలుగులు

- 2డీ, 3డీ చిత్రాలతో పాఠాల బోధన
- ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) వినియోగం
- రూ.17 లక్షలతో ఎంజీఎం హైస్కూల్ అప్‌గ్రేడేషన్
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సరైన విద్యతోనే ఏ సమాజం అయినా మారుతుందని, పేదలు కూడా నైపుణ్యవంతమైన విద్యను సొంతం చేసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కన్న కలలకు ప్రతిరూపంగా ప్రభుత్వ పాఠశాలలు ఆధునికీకరించబడ్డాయి. ఒకనాడు పెద్దగా సౌకర్యాలకు నోచుకోని గవర్నమెంట్ బడులు ఇప్పుడు స్మార్ట్‌గా సౌకర్యాలు సొంతం చేసుకుంటున్నాయి. డిజిటల్ హంగులు సమకూర్చుకుని.. లేటెస్ట్ టెక్నాలజీతో విద్యనందిస్తూ పిల్లల్ని సర్వ సమర్థులుగా తీర్చిదిద్దుతున్నాయి.

అల్లిపురం : ప్రభుత్వ పాఠశాలలు స్మార్ట్‌గా కొనసాగుతున్నాయి. 2డీ, 3డీ చిత్రాలతో డిజిటల్ విధానంలో పాఠాల బోధన జరుగుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూ.17 లక్షలు ఖర్చుపెట్టి తరగతి గదుల్లో ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానళ్లు (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేశారు. వీటిని గ్రీన్ బోర్డుగా, డిజిటల్ పాఠాలను చూపే టీవీగా ఏకకాలంలో వినియోగించుకునే విధంగా రూపొందించారు. బోర్డుపై రాస్తూనే ఉపాధ్యాయులు పాఠాలు బోధించగలిగే వెసులుబాటు ఇందులో ఉంటుంది. పాఠ్యాంశాలలో ఏవైనా అంశాలు యానిమేషన్ చిత్రాలతోను, దృశ్య, శ్రవణ మాధ్యమాల్లో పిల్లలకు బాగా అర్థం అవుతాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఐఐటీ స్థాయి ఉన్నత విద్యా సంస్థల్లో అందించే విధంగా పాఠశాల స్థాయిలో బోధనలు జరుగుతున్నాయి. ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఒక రకంగా ఆండ్రాయిడ్ స్క్రీన్ కంప్యూటర్‌గానే చెప్పుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ మాదిరిగానే ఈ ప్యానల్స్ పని చేస్తాయి. ఇంటర్‌నెట్ ఉపయోగించి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ప్యానెల్‌పై రాసేందుకు ఒక పెన్ను కూడా సమకూర్చారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో ఉపాధ్యాయులకు శిక్షణ అందజేశారు.

బ్లాక్ బోర్డు, చాక్‌పీస్‌లకు స్వస్తి..

దశాబ్దాలుగా ఉపాధ్యాయులు నల్లబోర్డు, గ్రీన్‌బోర్డుపై తెల్ల చాక్‌పీస్‌తో బోధిస్తు వస్తున్నారు. ఆధునిక విధానాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనకు మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా గూగుల్ అసిస్టెంట్ సదుపాయంతో తరగతులు నిర్వహించేలా తీర్చిదిద్దింది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ కూడా అందుకోలేని టెక్నాలజీని జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ తరహా విద్య అందడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడు తమ పిల్లలకు పాఠాలు చక్కగా అర్థమవుతున్నాయని, పరీక్షల్లో మంచి ఫలితాలు వెలువడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

డిజిటల్ తరగతుల నిర్వహణలో హైలైట్స్

- బ్లాక్ బోర్డు, చాక్‌పీస్‌లకు స్వస్తి
- స్మార్ట్ ఫోన్ మాదిరి ప్యానల్స్ వినియోగించి పాఠాల బోధన
- జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో ఉపాధ్యాయులకు శిక్షణ
- యానిమేషన్ చిత్రాలు, దృశ్య, శ్రవణ మాధ్యమాల సాయంతో పాఠ్యాంశాల బోధన
- ప్యానెళ్లపై రాసేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక పెన్

బోధన అద్భుతం..



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యా బోధన అందిస్తోంది. ఉపాధ్యాయులకు ప్యానెల్స్‌పై బోధన ఎలా చేయాలో తగిన శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయగలుగుతున్నాం. అవసరమైతే ఇంటర్ నెట్ ద్వారా కంటెంట్ డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు వివరించగలుగుతున్నాం. బీఎస్‌ఎన్‌ఎల్ నెట్ సౌకర్యం కూడా కల్పించారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా విద్యార్థులు కూడా పాఠాలు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. మంచి ఫలితాలు సాధిస్తారు.

– **ఆర్.నాగభూషణం**, ప్రధానోపాధ్యాయులు, ఎంజీఎం హైస్కూల్

కార్పొరేట్‌కు దీటుగా..



మేము ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నట్లు లేదు. కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్నట్లు ఉంది. వారికి కూడా అందని టెక్నాలజీ ప్రభుత్వం మాకు కల్పించింది. దీని వలన మాకు పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. అవగాహన చేసుకోగలుగుతున్నాం. మంచి మార్కులు సాధించగలమనే నమ్మకం మాలో కలుగుతుంది.

– **డి.నిశిత**, 9వ తరగతి, ఎంజీఎం హైస్కూల్

పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి..



ఆండ్రాయిడ్ ప్యానల్స్ కావటం వలన మాకు పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం కలిపించడంతో మా అనుమానాలను తక్షణమే నివృత్తి చేసుకునే అవకాశం కలుగుతోంది. ప్రతి విషయాన్ని ఉపాధ్యాయులు మాకు దృశ్య, శ్రవణ విధానంలో అర్థమయ్యేలా వివరిస్తున్నారు. అర్థం కాని వారికి కూడా సులువుగా పాఠాలు అర్థమవుతున్నాయి.

– **టి.ఢిల్లీ**, 9వ తరగతి, ఎంజీఎం హైస్కూల్

పిల్లలు చక్కగా చదువుతున్నారు..



గతంలో కంటే విద్యా బోధనలో కొత్తదనం కనిపిస్తోంది. పిల్లలకు ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా విద్యా బోధన చేస్తుండటంతో వారికి పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. పాఠాలు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతుండటం అభివృద్ధికి నిదర్శనం.

– **ఎం.చంద్రకళ**, 6వ తరగతి విద్యార్థి తల్లి

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా బోధన..



కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతోంది. దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా బోధన జరపడం ఆనందంగా ఉంది. పిల్లలకు సులువుగా పాఠాలు అర్థమవుతున్నాయంటున్నారు. వారికి గల అనుమానాలను ఉపాధ్యాయులతో పాటు ఇంటర్‌నెట్ ద్వారా నివృత్తి చేసుకుంటున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వ పాఠశాలల్లో అందజేయడం నిజంగా విద్యా వ్యవస్థలో మార్పులకు ప్రభుత్వం తీసుకున్న చర్యలనే చెప్పాలి.

– **అప్పలరాజు**, 8వ తరగతి విద్యార్థి తండ్రి

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



నేరెళ్లకోనేరు సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఉడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న చిన్నమ్మలు, నీలకంఠం, గోపీకృష్ణ

అల్లిపురం : జగనన్న పాలనలో పేదవారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 32వ వార్డు నేరెళ్లకోనేరు సచివాలయం పరిధిలో గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నేరెళ్లకోనేరు సచివాలయం వద్ద జెండా, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. 32వ వార్డు సచివాలయం పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.7 కోట్ల 72 లక్షలు, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) కింద రూ.7 కోట్ల 40 లక్షలు, మొత్తం రూ.15 కోట్ల 12 లక్షలు ఎలాంటి వివక్ష లేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ రూ.4,69,459.45 కోట్లు అందజేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, 32వ వార్డు సీనియర్ నాయకులు మూలే రామిరెడ్డి, బోణి దేవ, బాబుల్ శ్రీను, కృష్ణవేణి, భవానీ, దేవుడు లక్ష్మి, భాను, నీరజ్, శ్రీనివాస్‌రెడ్డి, మెహన్ గణేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సీవోలు, ఆర్పీలు ప్రజలు పాల్గొన్నారు.

33వ వార్డులో..

ఉడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కన్వీనర్లు నీలాపు అయ్యప్పరెడ్డి, కృష్ణారెడ్డి, వార్డు సీనియర్ నాయకుడు రంధి గోపీకృష్ణ, సీనియర్ నాయకురాలు ఎల్లంకి చిన్నమ్మలు పాల్గొని పార్టీ జెండా, అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరించారు. తర్వాత సచివాలయం పరిధిలో గల పెద్దలతో మమేకమై సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో బొడ్డేటి ప్రసాద్, పి.రాము, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమ్‌నగర్ అభివృద్ధికి కృషి



భీమ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జీవీఎంసీ 32వ వార్డు భీమ్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన పూతివారిమాన్యం, భీమ్‌నగర్ ప్రాంతాల్లో వార్డు సీనియర్ నాయకుడు మూలే రామిరెడ్డితో కలిసి పర్యటించారు. స్థానికులు తెలిపిన సమస్యలకు సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంచి నీటి సరఫరాలో మార్పులు, 45 నిమిషాలు సరఫరా అయ్యేలా చూస్తానని, భీమ్‌నగర్‌లో గల నైట్ షెల్టర్‌ను వేరే కమ్యూనిటీ హాల్‌కు మార్చి, కల్యాణ మండపంగా అందుబాటులోకి తీసుకువస్తానని, క్రిస్టియన్ శ్మశాన వాటికలో లైట్లు, రోడ్ల అభివృద్ధి త్వరలోనే పూర్తి చేస్తానని వాసుపల్లి స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సురపతి అప్పన్న, బోణి దేవ, బాబుల్ శ్రీను, బొడ్డేటి కిషోర్, కృష్ణవేణి, శ్రీనివాస్‌రెడ్డి, కోటి, కుమారి, గోవింద్, భానుమూర్తి, ఆదివిష్ణు, లండా రమణ, సుబ్రహ్మణ్యం, రామరాజు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సివిల్ ఏఈ పార్వతి, రవికుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరమ్మకు ఘనంగా సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న గౌరీ సంఘం, గౌరీ మహిళా మండలి సభ్యులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గౌరీ మహిళా మండలి, గౌరీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి గురువారం సారె అందజేశారు. ఈ సందర్భంగా గౌరీ మహిళా మండలి అధ్యక్షురాలు కర్రి వరలక్ష్మి, కార్యదర్శి కాండ్రేగుల కుమారి, కోశాధికారి భీశెట్టి అనురాధ, సహాయ కోశాధికారి కొణతాల నూకాలమ్మ ఆధ్వర్యంలో యువజన సమాజం నుంచి నీలమ్మ వేప చెట్టు, ఎంజీఎం హైస్కూల్ మీదుగా వేంకటేశ్వరమెట్ట వరకు మేళ తాళాలతో అమ్మవారికి పసుపు, కుంకుమ, అరటి పండ్లు, చీర, జాకెట్టు, గాజులు, పలు రకాల స్వీట్లతో కూడిన సారె సమర్పించారు. వారికి గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

10న దయాళ్‌బాగ్ వస్తు ప్రదర్శన

ఆరిలోవ: దయాళ్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 10న జరగనుందని దయాళ్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాక్షినగర్ ప్రాంతం దయాళ్‌నగర్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు వస్తు ప్రదర్శన ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాధాస్వామి సత్సంగులు తయారు చేసిన చేనేత దుప్పట్లు, తువ్వాళ్లు, షర్టింగ్ క్లాత్‌లు, డ్రెస్ మెటీరియల్, బనియన్లు, బూట్లు, లెదర్ చెప్పులు, ట్రావెల్ బ్యాగులు, సబ్బులు, డిటర్జెంట్ పౌడర్లు, అగరబత్తులు, ఆయుర్వేద మందులు, దోమ తెరలు తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయన్నారు.

శ్రీనివాసనగర్‌లో అన్నదానం

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో బాల గౌరమ్మ ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న 8వ వార్షికోత్సవ పండగ మహోత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నదానం నిర్వహించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ఏళ్లుగా ప్రతి ఏటా గౌరమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.